



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com





హైదరాబాద్ | ఆదివారం 12-7-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 299 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# జనాభాకు అనుగుణంగా హైదరాబాద్ అభివృద్ధి

## ట్రాఫిక్ నియంత్రణకు ఫ్లై ఓవర్లు, రోడ్ల వెడల్పు కార్యక్రమాలు
## రక్షణరంగ భూములు ఇప్పిస్తే మరిన్ని ఫ్లై ఓవర్ల నిర్మాణం
## ఇందిరాపార్కు వద్ద ఫ్లై ఓవర్‌కు శంకుస్థాపన చేసిన కేటీఆర్, కిషన్ రెడ్డి

హైదరాబాద్,జూలై 11(ఆర్ఎన్ఎ): జనాభాతో విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ చిక్కులు లేకుండా చేయడంతో పాటు, సుందరనగరంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి కెటిఆర్ అన్నారు. అనేక అభివృదద్ఇ కార్యక్రమాలతో హైదరాబాద్ అద్భుత నగరంగా మారుతోందన్నారు. లాక్‌డౌన్‌తో మార్చి నెల నుంచి ఇప్పటివరకు జీహెచ్ఎంసీలో నాలుగురెట్ల వేగంతో పనులను పూర్తిచేశామని, తొమ్మిది నెలల్లో జరగాల్సిన పనులు లాక్‌డౌన్ వల్ల రెండు నెలల్లోనే పూర్తయ్యాయని మంత్రి కేటీఆర్ అన్నారు. నగరంలో పలు అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి కేటీఆర్ భూమిపూజ చేశారు. ఇందిరాపార్క్ నుంచి వీఎస్టీ వరకు వంతెన నిర్మాణానికి ఇందిరాపార్కు వద్ద శంకుస్థాపన చేశారు. ఎస్సార్‌డీపీలో భాగంగా రెండు వంతెనల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. రూ.350 కోట్లతో ఇందిరా పార్కు నుంచి వీఎస్టీ వరకు ఎలివేటెడ్ స్టీల్ బ్రిడ్జి, రెండో దశలో రూ.76 కోట్లతో రాంనగర్ నుంచి బాగ్‌లింగంపల్లి వరకు మూడు లేన్ల వంతెన నిర్మిస్తామని తెలిపారు. రూ.6 వేల కోట్లతో ఎస్సార్‌డీపీ పనులు చేస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీలో రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. హైరదాబాద్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను వేగంగా పూర్తిచేస్తామని చెప్పారు. రూ.5 వేల కోట్లతో స్కైవేల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. అంబర్‌పేట ఫ్లై ఓవర్ నిర్మాణం త్వరలో పూర్తిచేస్తామన్నారు. 18 కి.మీ. చొప్పున రెండు ఎలివేటెడ్ కారిడార్లు ప్రతిపాదించామని తెలిపారు. రక్షణ రంగ భూములు ఇచ్చేలా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కృషిచేయాలన్నారు.

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య తగ్గించేందుకే వివిధ ప్రాజెక్టుల రూపంలో పనులు చేపడుతున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గత ఆరు సంవత్సరాలుగా హైదరాబాద్ నగరంలో రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. కోవిడ్ కట్టడిలో జీహెచ్ఎంసి సిబ్బంది బాగా పనిచేశారని మంత్రి కితాబు ఇచ్చారు. వారికి ప్రభుత్వం మూడు నెలలు ఇన్సెంటివ్ ఇచ్చిందని వెల్లడించారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి: కిషన్‌రెడ్డి

ఆర్టీసీ క్రాస్ రోడ్ ట్రాఫిక్ సమస్య చాలా కాలం నుంచి ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. అప్పటినుండి ఇక్కడ ఫ్లై ఓవర్ రావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. గతంలో భారీగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఆర్టీసీ క్రాస్ రోడ్డు ఒకటి.. ఫ్లై ఓవర్‌తో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరంలో జన సాంద్రత పెరిగి చాలా అభివృద్ధి జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రోడ్లు, ఫ్లై ఓవర్ చాలా ముఖ్యమైనవని పేర్కొన్నారు. నగరంలోకి పెట్టుబడిదారులు మరింత మంది రావాలి అంటే ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని కోరారు. అభివృద్ధి కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా సహకరించుకోవాలని ఆకాంక్షించారు.




ఇందిరా పార్కు నుంచి వీఎస్‌టి వరకు నిర్మించబోయే ఫ్లై ఓవర్‌కు శంకుస్థాపన చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కెటిఆర్. చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

# ఇంటివద్దే బోనాలు నిర్వహించాలి

## ఉజ్జయిని ఆలయంలో పూజారులతో బోనాలు: -తలసాని

## ఊరేగింపునకు అనుమతి ఇవ్వాలంటూ హైకోర్టులో పిల్

హైదరాబాద్,జూలై 11(ఆర్ఎన్ఎ): కరోనా కారణంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరను నిరాడంబరంగా నిర్వహించనున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. ఆదివారం నుంచి ఉజ్జయినీ మహంకాళి బోనాలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో జాతర ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. ఆలయ చరిత్రలో మొదటిసారిగా భక్తులు లేకుండా బోనాల వేడుకలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతిఒక్కరు ఇళ్లలోనే ఉంటూ బోనాలు జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనవసంగా బయటకు వచ్చి భక్తులు ఇబ్బందులు పడొద్దని సూచించారు. ఆలయంలో కేవలం పూజారులు మాత్రమే బోనాలు సమర్పిస్తారని చెప్పారు. తనజీవిత కాలంలో ఇలాంటి పరిస్థితి ఎదురు కాలేదన్నారు. అయితే ప్రపంచమంతా సమస్య ఉన్నందున ప్రజలు సహకరించాలన్నారు. ఇదిలావుంటే అమ్మవారి ఊరేగింపుకు అనుమతి ఇవ్వాలని అక్కన్న, మాదన్న ఆలయ నిర్వాహకులు హైకోర్టులో పిల్ ధాఖలు చేశారు. పాతబస్తీలోని అక్కన్న మాదన్న ఆలయం చారిత్రాత్మక కట్టడం అని వారు పిల్‌లో పేర్కొన్నారు. కరోనా సాకుతో ఎవరినీ సంప్రదించకుండా బోనాల పండుగను ప్రభుత్వం నిలిపివేసింది వారు ఆరోపించారు. దశాబ్దాల కాలం నుండి వస్తున్న అమ్మవారి ఊరేగింపుకు అనుమతి ఇవ్వాలని పిటిషనర్ హైకోర్టును కోరారు. అదేవిధంగా సంప్రదాయాలకు విఘాతం కలగకుండా చూడాలని హైకోర్టును కోరారు. ఊరేగింపునకు అనుమతిస్తే.. ప్రజలను కరోనా నుండి రక్షించాలని అమ్మవారిని ప్రార్ధిస్తూ బోనాల పండుగ జరుపుతామని పిటీషనర్ పేర్కొన్నారు. ఈ పిల్ ను స్వీకరించిన హైకోర్టు.. సోమవారం విచారించునున్నట్లు తెలిపింది.

# అత్యధిక కరోనా కేసులున్న రాష్ట్రాలపై పర్యవేక్షణ

## ధన్వంతరి రథ్ ప్రయోగాన్ని పరిశీలించండి
## కరోనాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగేలా విస్తృతంగా ప్రచారం
## ఉన్నతస్థాయి సమీక్షలో అధికారులకు ప్రధాని సూచన

న్యూఢిల్లీ,జూలై11(ఆర్ఎన్ఎ): ప్రధాని నరేంద్రమోడీ శనివారం దేశంలో కరోనా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. అత్యధిక పాజిటివ్ రేటు నమోదవుతున్న రాష్ట్రాలపై జాతీయ స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణకు మోదీ ఆదేశించారు. అహ్మదాబాద్‌లో విజయవంతమైన 'ధన్వంతరి రథ్' కార్యక్రమాన్ని అంతటా అమలు చేస్తే బాగుంటుందని సూచించారు. అహ్మదాబాద్‌లో ఇంటి వద్దనే బాధితులను పర్యవేక్షించడం, వైద్యం అందించే 'ధన్వంతరి రథ్'ను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ దీన్ని అమలు చేయాలని సూచించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్, నీతి ఆయోగ్ సభ్యుడు, కేబినెట్ కార్యదర్శి, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు హాజరయ్యారు. కరోనా వైరస్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగేలా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. మహమ్మారిని సమర్థంగా కట్టడి చేస్తున్న కేంద్ర, రాష్ట్ర, స్థానిక అధికారులను ప్రశంసించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కరోనా వైరస్ మహమ్మారి పరిస్థితిపై మోదీ సమీక్షించిన ప్రధాని.. రాష్ట్రాల సన్నద్ధతను తెలుసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యక్తిగత పరిశుభ్రత, సాంఘిక ప్రవర్తన బాగుండాలని సూచించారు. కరోనాపై అవగాహనను విస్తృతం చేయాలని ఆదేశించారు. ఎవరికీ వైరస్ సంక్రమించకుండా కఠిన చర్యలు కొనసాగించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యానికి తావులేదన్నారు. కాగా, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం శనివారం 27, 114 కరోనా పాజిటివ్ కేసులు నమోదు కాగా, మొత్తం 8లక్షల మార్కును దాటింది. ఇప్పటి వరకు 8,20,916 పాజిటివ్ కేసులు నమోదవగా, వీరిలో 2,83,407 మంది చికిత్స పొందుతుండగా, 5,15,387 మంది కోలుకున్నారని తెలిపింది. మరో 22,123 మంతి వైరస్ ప్రభావంతో మరణించినట్లు వివరించింది.




.కరోనాపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ప్రధాని మోడీ

# కరోనాపై బాంబు పేల్చిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

## పూర్తిగా అరికట్టలేమన్న ఎమర్జెన్సీ ప్రోగ్రాం చీఫ్ డాక్టర్ మైక్ ర్యాన్
## ఇటోలీజుమ్యాబ్‌ను వాడొచ్చన్న భారత డ్రగ్ రెగ్యులేటరీ సంస్థ
## రెమ్ డెసివర్‌తో తగ్గుతున్న మరణాల సంఖ్య

న్యూఢిల్లీ,జూలై11(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక వ్యాఖ్యలు చేసింది. కరోనా పూర్తిగా అంతం చేసే అవకాశాలు తక్కువేనని చెప్పింది. దీనికి సంబంధించి ఆ సంస్థ ఎమర్జెన్సీ ప్రోగ్రాం చీఫ్ డాక్టర్ మైక్ ర్యాన్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైరస్‌ను పూర్తిగా నిర్మూలించే అవకాశం తక్కువేనంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే.. కేసులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతాల్లో వ్యాప్తిని అడ్డుకోవడం ద్వారా రెండోసారి అది చెలరేగకుండా చేయొచ్చని తెలిపారు. అలా చేస్తే లాక్‌డౌన్‌ల నుంచి కూడా ప్రజలకు విముక్తి లభిస్తుందని డాక్టర్ మైక్‌ర్యాన్ అన్నారు. ఇదిలావుంటే ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌కు ఇప్పటివరకు ఏ ఒక్క దేశం సరైన మందును కనిపెట్టలేదు. తాత్కాలిక ఉపశమనం కోసం అందుబాటులో ఉన్న అన్ని రకాల మందులను వాడుతున్నారు. తాజాగా చర్మ సంబంధిత వ్యాధి సోరియాసిస్ చికిత్సకు ఉపయోగిస్తున్న ఇటోలీజుమ్యాబ్ మందును కోవిడ్-19 పేషెంట్లకు వాడవచ్చవంటూ భారత డ్రగ్ రెగ్యులేటరీ సంస్థ శుక్రవారం అనుమతు లిచ్చింది. తీవ్రమైన తీవ్రమైన శ్వాసకోసతో బాధపెడుతున్న కోవిడ్ -19 రోగులకు ఈ మందును ఉపయోగించుకోవచ్చు అంటూ పీటీఐ సంస్థకు శుక్రవారం వెల్లడించింది. ఇటోలీజుమ్యాబ్ మందును భారత్‌కు చెందిన బయోకాన్ సంస్థ తయారు చేస్తోంది. చాలా సంవత్సరాల నుంచి సోరియాసిస్ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తులకు ఈ మందును ఉపయోగిస్తున్నట్లు బయోకాన్ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. కరోనాతో బాధపడుతున్న రోగులపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించామని, ఆ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నట్లు తేలిన తరువాత ఇటోలిజుమ్యాబ్‌కు అనుమతులిచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. దీనిపై డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా డాక్టర్ వి.జి. సోమయాని స్పందిస్తూ.. బయోకాన్ సంస్థ తయారు చేసిన మోనోక్లోనల్ యాంటీబాడీ ఇంజెక్షన్ ఇటోలిజుమాబ్ సోరియాసిస్ సంబంధిత సైటోకిన్ రిలీజ్ సిండ్రోమ్ చికిత్సకు ఉయపయోగిస్తారన్నారు. కోవిడ్-19 చికిత్సకు సంబంధించి క్లినికల్ ట్రయల్స్ నిర్వహించిన తర్వాతే ఈ మందును పరిగణలోకి తీసుకున్నామన్నారు.

### రెమ్ డెసివర్‌తో మరణాలు తగ్గించొచ్చు

ఇదిలావుంటే హెటిరో ఫార్మా తయారుచేసిన యాంటి వైరల్ రెమ్‌డెసివిర్ మందు కరోనా మరణాలను తగ్గించే అవకాశాలు ఉన్నట్లు పరిశోదనలో తేలిందని గిలియడ్ సైన్సెస్ సంస్థ తెలిపింది. అయితే రెమ్‌డెసివిర్ మందుపై మరిన్ని క్లినికల్ ట్రయల్స్ నిర్వహించిన తర్వాతే ఈ విషయంపై మరింత స్పష్టత రానుందని సంస్థ పేర్కొంది. తాజాగా జరిపిన విశ్లేషణలో కరోనా నుంచి కోలుకున్న 312 మంది నుంచి సమాచారం సేకరించాము. దీంతో పాటు వ్యాధి తీవ్రత ఎక్కువ ఉన్న 818 మంది రోగులపై రెమ్‌డెసివిర్ ప్రభావం ఏ మేరకు పనిచేస్తుందన్నది అధ్యయనం చేసినట్లు గిలియడ్ సైన్సెస్ వెల్లడించింది. కరోనాతో బాధపడుతున్న రోగులకు 5 నుంచి 10 రోజులు పాటు రెమ్‌డెసివిర్ మందు డోజేజ్ విధానంలో అందించారని దాని వల్ల వారికి ఎలాంటి నష్టం కలగలేదని అధ్యయనంలో తేలింది..కానీ ప్లేసిబోతో రెమ్‌డెసివిర్‌ను పోల్చిచూడలేదని స్పష్టం చేసింది. రెమ్‌డెసివిర్ ద్వారా చికిత్స పొందుతున్న రోగుల్లో 74.4 శాతం మంది 14 రోజుల్లో కోలుకుంటున్నారని తేలింది. కాగా రెమ్‌డెసివిర్ మందుతో చికిత్స పొందిన రోగుల మరణాల రేటు 14 రోజుల్లో 7.6 శాతంగా ఉంటే.. అదే ఆ మందు తీసుకోనివారు మరణాల రేటు 12.5 శాతంగా ఉంది. గత ఏప్రిల్‌లో అమెరికాలో నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో ప్లేసిబో ఇచ్చిన రోగుల కంటే రెమ్‌డెసివిర్ ఇచ్చిన రోగులు 31 శాతం వేగంగా కోలుకున్నారని తమ అధ్యయనంలో తేలినట్లు తెలిపింది. అయితే దీనిపై మరిన్ని క్లినికల్ ట్రయల్స్ నిర్వహించిన తర్వాతే రెమ్‌డెసివిర్ మందుపై ఒక స్పష్టత వస్తుందని గిలియడ్ సంస్థ పేర్కొంది.

# పోలీసు చర్యను సమర్ధించిన వికాస్ దుబే భార్య

## దూబే కారణంగా పూర్వీకుల ఆస్తి కోల్పోయానన్న తండ్రి

కాన్పూర్,జూలై11(ఆర్ఎన్ఎ): ఉత్తర్‌ప్రదేశ్‌లో గ్యాంగ్‌స్టర్ వికాస్ దుబేను ఎన్‌కౌంటర్‌లో పోలీసులు హతమార్చిన ఘటనపై అతడి కుటుంబసభ్యులు స్పందించారు. తగిన శిక్ష పడిందని పోలీసు చర్యను వారు సమర్థించారు. వికాస్ దుబే అంత్యక్రియల్లో పాల్గొన అతడి భార్య రిచా దుబే మాట్లాడుతూ.. 'నా భర్త తప్పు చేశాడు.. ఈ శిక్షకు అర్హుడే' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు. గ్యాంగ్‌స్టర్ అంత్యక్రియలు కాన్పూర్‌లోని భైరవ్ ఘాట్‌లో నిర్వహించారు. భార్య, చిన్న కొడుకు, బావమరిది తప్ప ఇతర కుటుంబసభ్యులు హాజరుకాలేదు. ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు సరైన చర్యే తీసుకున్నారు. నా కుమారుడు ఎనిమిది మంది పోలీసులను చంపేశాడు. ఇది క్షమించరాని నేరం. ముందు నుంచి మా మాట వినుంటే అతడి జీవితం ఇలా ముగిసేది కాదు. మాకు ఏవిధంగాను అతడు సహకరించలేదు. అతడి కారణంగా మా పూర్వీకుల ఆస్తి నేలమట్టమైంది. ఈ శిక్ష అతడికి సరైనదే. అలా చేయకపోతే రేపు ఇతరులు కూడా ఇదే విధంగా వ్యవహరిస్తారు' అని వికాస్ దుబే తండ్రి రామ్‌కుమార్ దూబే అన్నారు. తనను అరెస్టు చేయడానికి వస్తున్న 8 మంది పోలీసులను ఒక పథకం ప్రకారం దారుణంగా కాల్చి చంపించిన గ్యాంగ్‌స్టర్ వికాస్ దుబేను.. శుక్రవారం కాన్పుర్ శివార్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పోలీసులు హతమార్చిన విషయం తెలిసిందే.

# ప్రధాన నగరాలకు ఎతిహాద్ విమానాలు

## నియంత్రణ ఎత్తేయడంతో గల్ఫ్ ఎయిర్‌లైన్స్ ప్రకటన

న్యూఢిల్లీ,జూలై11(ఆర్ఎన్ఎ): గల్ఫ్ ఎయిర్‌లైన్స్ ఎతిహాద్ ఈ నెల 12 నుంచి 26 వరకు భారత్‌లోని ఆరు నగరాల నుంచి అబుదాబికి ప్రత్యేక విమాన సర్వీసులు నడపనున్నట్లు ప్రకటించింది. విదేశాలకు విమాన సర్వీసులపై భారత్ ఆంక్షలు సడలిస్తూ నిర్ణయం తీసుకున్న మరుసటి రోజే ఎతిహాద్ ఈ ప్రకటన చేయడం విశేషం. ఇండియాలోని బెంగళూరు, చెన్నై, కొచ్చి, న్యూఢిల్లీ, హైదరాబాద్, ముంబై నగరాల నుంచి అబుదాబికి విమానాలు నడపనున్నట్లు ఎతిహాద్ తన ప్రకటనలో పేర్కొంది. 'ప్రయాణీకులందరూ అబుధాబి ప్రభుత్వం నుంచి ఐసీఏ అనుమతి కలిగి ఉండాలి. అలాగే అవసరమైన అనుమతులు లేకుండా చెక్-ఇన్ చేయడానికి అనుమతించబడదు.' అని ఎయిర్‌లైన్స్ యాజమాన్యం పేర్కొంది. కరోనా లాక్‌డౌన్ కారణంగా భారత్‌లో చిక్కుకున్న యూఏఈ రెసిడెంట్స్‌కు కేంద్రం గురువారం గుడ్‌న్యూస్ చెప్పింది. 'వందే భారత్ మిషన్'లో భాగంగా 15 రోజుల పాటు ఇండియా నుంచి యూఏఈకి ప్రత్యేక విమాన సర్వీసులు నడప నున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 12 నుంచి 26 వరకు ఈ విమానాలు నడవనున్నాయి. ఈ మేరకు ఇరు దేశాల పౌర విమానయాన శాఖల మధ్య ఒప్పందం కూడా కుదిరింది. దీంతో వందలాది మంది భారతీయుల దీర్ఘకాల నిరీక్షణకు తెర పడినట్లైంది.

## చరిత్రలో నేటినిజం



కం॥ సినిమా సంగీతమ్మును
ధునిగా వినిపించి మనసు దోచెడి ఘనుడౌ
మణిశర్మ జన్మదినమున
ఘనముగ వందించెద శుభ కామన శతమున!!

( జూలై 12 జూలియస్ సీజరు జన్మదినం..)

-రాధశ్రీ

సెల్: 9494481210



# ఢిల్లీలాగా కరోనాను నియంత్రించాలి

## అధికారులతో సమీక్షలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,జూలై11(ఆర్ఎన్ఎ): కరోనా నియంత్రణకు ఢిల్లీ మాదిరిగా అన్ని రాష్ట్రాలు స్పందించి ఆ మేరకు చర్యలు చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో కరోనా పరిస్థితిపై శనివారం ఆయన సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ హర్ష వర్ధన్, నీతి ఆయోగ్ సభ్యుడు, క్యాబినెట్ కార్యదర్శి, కేంద్ర ప్రభుత్వానికి చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక క్రమశిక్షణను పాటించాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. కరోనా గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని, వైరస్ వ్యాప్తిని నివారించ డానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఢిల్లీలో కరోనా పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చేపట్టిన చర్యలను మోదీ అభినందిం చారు. కరోనా తీవ్రత ఎక్కువగా రాష్ట్రాలు ఢిల్లీ మాదిరిగా వ్యవహరించాలని ప్రధాని పేర్కొన్నారు. శనివారం నాటికి దేశంలో కరోనా కేసుల సంఖ్య 8 లక్షలను దాటగా, 27,114 మంది మరణించారు.

# కరోనా తీవ్రత, సచివాలయ కూల్చివేతపై బిజెపి సీరియస్

## -పార్టీ ప్రముఖులతో కిషన్‌రెడ్డి సమాలోచనలు

హైదరాబాద్,జూలై 11(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా తీవ్రత, సచివాలయం కూల్చివేత వ్యవహారంపై బిజెపి సీరియస్‌గా చర్చిస్తోంది. ఈ రెండు వ్యవహారాలపై గత కొన్నిరోజులుగా ప్రతిపక్ష పార్టీల నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ విషయమై శనివారం నాడు బీజేపీ ముఖ్యనేతలు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. భేటీలో భాగంగా తాజా రాజకీయ పరిణామాలు, సచివాలయం, నల్లపోచమ్మ దేవాలయం కూల్చివేత, కరోనా తీవ్రత, కేంద్రం రాష్ట్రానికి అందించిన సహాయం, భవిష్యత్ కార్యాచరణపై నిశితంగా చర్చించినట్లు సమాచారం. ఈ భేటీ అనంతరం మీడియా మీట్ నిర్వహించి వివరాలు వెల్లడిస్తారని తెలుస్తోంది. కాగా.. శుక్రవారం నాడు మురలీధర్ రావు ఈ కూల్చివేతల వ్యవహారంపై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు, ఆరోపణలు చేసిన విషయం విదితమే. ప్రభుత్వం కూడా కూలిపోతుందని హెచ్చరించారు

# కరోనా పేషెంట్లకు ఇంట్లోనే వైద్యం

## ప్రభుత్వ పర్యవేక్షణలో చికిత్స
## ఇంటికే కిట్ అందించే యత్నాలు
## అధికారులతో సమీక్షించిన మంత్రి ఈటెల

హైదరాబాద్,జూలై 11(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో ఇప్పుడు అత్యవసరమైతే తప్ప ఆస్పత్రిలో ఉండాలనిపించడం లేదన్న విమర్శల వస్తున్నాయి. కరోనా రోగులను కూడా వీలైనంత వరకు ఇంట్లోనే ఉండి జాగ్రత్తలు పాటిస్తూ వైద్యులు సూచినట్లు చేయమని సర్కారు చెబుతోంది. ఇంటి వద్ద ఉన్న కరోనా రోగులకు మరింత వెసులుబాటు కలిగించేందుకు వీలుగా తెలంగాణ సర్కారు కరోనా కిట్‌లను ఉచితంగా అందజేయనుంది.

చికిత్సకు అవసరమైన ఔషధాలు, మాస్కులు, శానిటైజర్లను సర్కారే ఉచితంగా సమకూర్చనుంది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆస్పత్రులలో ఎంత మంది కరోనా రోగులు చికిత్స పొందుతన్నారో దాదాపు అదే స్థాయిలో ఇంటి వద్ద ఉండి చికిత్స పొందుతున్నా వారు ఉన్నారు. కరోనా లక్షణాలు బయటపడినా ఆస్పత్రికి వెళ్లాలంటే భయపడుతున్నారు. దానికి తోడు రోగితో పాటు మరొకరు తోడు వెళ్లాలి. సామాజిక వ్యాప్తి నేపథ్యంలో పేషెంట్, వారి తాలూకు బంధువు ఇద్దరూ భయపడాల్సిన పరిస్థితి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని సర్కారు ఈ ఉచిత కిట్ నిర్ణయం తీసుకుంది. 17 రోజుల పాటు హోం క్వారంటైన్ లో ఉన్న వారి కోసం ఈ కిట్ అందించనుంది. బాధితుడు ఇంటి నుండే చికిత్స పొందుతున్నాడనే సమాచారం వైద్యులు నిర్ధారించుకోగానే వారికి సమీప ప్రభుత్వ వైద్యశాల నుంచి కిట్లను నేరుగా వైద్య సిబ్బంది బాధితుని ఇంటికెళ్లి అందజేస్తుంది. ఒకే ఇంట్లో ఒకరికి మించి కరోనా రోగులు ఉన్నా అందరికీ ఉచితంగా అందిస్తుంది. వైద్య సిబ్బంది తరచుగా ఫోన్ చేసి వారి ఆరోగ్య సమాచారాన్ని ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటారు. ఇక కిట్‌లో అందించే వస్తువులు.. శానిటైజర్లు, మాస్కులు, గ్లౌజులు, హైడ్రాక్సీక్లోరోక్విన్, పారాసిటమల్, యాంటీ బయాటిక్స్, లివోసెటిరిజైన్, విటమిన్ సి,ఇ,డి3, ఎసిడిటీని తగ్గించే ఔషధాలు, ఏం చేయాలి.. ఏం చేయకూడదు అని అవగాహన పెంపొందించే పుస్తకం ఉంటాయి. ఈ నిర్ణయంతో అనేకులకు మేలు జరుగనుందని తెలుస్తోంది. ప్రజల్లో కూడా భరోసా దక్కనుంది.

# కరోనాపై భయం వద్దంటూ హిజ్రాల ప్రచారం

చెన్నై,జూలై11(ఆర్ఎన్ఎ): కరోనాపై భయాందోళన చెందవద్దని హిజ్రాలు ప్రచారం నిర్వహించారు. తమిళనాడులో శనివారం కరోనాపై వీరంతా అవగాహన కల్పించారు. కరోనాపై భయాన్ని దూరంగా ఉంచాలంటూ చెన్నైలోని తోండియార్‌పేట, నేతాజీ నగర్ మార్కెట్ ప్రాంతాల్లో చెన్నై కార్పొరేషన్ వాలంటీర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కరోనా వైరస్‌పై అవగాహన కల్పించే ప్లకార్డులను ప్రదర్శించారు. కరోనా గురించి భయాందోళన చెందవద్దని, మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం, వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా ఈ మహమ్మారిని తరిమిగొడదామంటూ హిజ్రాలు నినాదాలు చేశారు. తమిళనాడులో కరోనా కేసుల సంఖ్య 1.27 లక్షలకు చేరగా ఇప్పటి వరకు 1,765 మంది చనిపోయారు.




.మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని శివ్వంపేటలో నిర్మించిన డంఇపంగ్ యార్డును ప్రారంభించిన మంత్రి హరీష్ రావు.

# రైతు సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తున్నాం

## వారికి అన్ని విధాలుగా అండగా ఉంటున్నాం
### పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి హరీష్ రావు

మెదక్,జూలై11(ఆర్ఎన్ఎ): తమ ప్రభుత్వం రైతుల సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తోందని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని అన్నారు. ఇది రైతు ప్రభుత్వం అని హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో మంత్రి శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. పర్యటన సందర్భంగా మంత్రి శివంపేట మండలం కొత్తపేట, రత్నాపూర్ గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డ్‌లను ప్రారంభించారు. అంతకుక్రితం కొత్తపేట గ్రామంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. రత్నాపూర్ గ్రామంలో రైతు వేదిక నిర్మాణానికి భూమి పూజ చేశారు. పర్యటన సందర్భంగా మంత్రి పొలాల్లో పనిచేసే కూలీలు, రైతులను కలిసి మాట్లాడారు. రైతుబంధు అందిందా లేదా అని ఆరా తీశారు. నియంత్రిత సాగు వల్ల రైతులకు కలిగే లాభాలను వివరించారు. రైతులు డిమాండ్ ఉన్న పంటలనే వేయాలన్న లక్ష్యంతో నియంత్రిత సాగును అందుబాటులోకి తెచ్చామన్నారు. కరోనాపై నిర్లక్ష్యం తగదని,పూర్తి జాగ్రత్తలతో ఉండాలన్నారు. కరోనా సోకిన వారిని చిన్న చూపొద్దు.. రోగంతో భయం కంటే జనంతో భయం ఎక్కువైంది.. కరోనా వచ్చిన వారు మనిషే కదా.. ధైర్యం చెప్పాలి.. వారిని అంటరానివారిగా చూడొద్దని మరోమారు ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. కరోనాతో అందరూ జాగ్రత్తగా ఉండాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతు నిర్ణయాత్మకశక్తిగా మారాలన్నదే సీఎం కేసీఆర్ ఆశయమని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా క్లస్టర్‌కు ఒక్కటి చొప్పున రైతు వేదికలను సర్కారు నిర్మిస్తున్నదన్నారు. ఇటీవల నర్సాపూర్‌కు వచ్చిన సందర్భంగా సీఎం కేసీఆర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీకి రూ.20లక్షలు, మండల కేంద్రానికి రూ.కోటితో పాటు కొత్తగా ఏర్పడ్డ నర్సాపూర్ మున్సిపాలిటీకి రూ.25కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఒంటరిగా ఉన్న మహిళలే లక్ష్యంగా పుస్తెలతాళ్ళను దొంగిలించే
# ఇద్దరు దొంగలు అరెస్ట్
### 51గ్రాములు బంగారు ఆభరణాలు స్వాధీనం

కరీంనగర్,జూలై11(నేటినిజం ప్రతినిధి): జల్సాలకు అలవాటుపడి డబ్బులకోసం ఒంటరిగా ఉన్న మహిళల మెడలలోని పుస్తెలతాళ్ళను దొంగిలిస్తున్న ఇద్దరు దొంగలను రామడుగు పోలీసులు శనివారం నాడు పట్టుకున్నారు. వారి వద్దనుండి 51గ్రాములు విలువచేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

చొప్పదండి సిఐ ఓ రమేష్ రామడుగు పోలీస్‌స్టేషన్‌లో ఈ దొంగలు పట్టుబడిన వారి వివరాలను వెల్లడించారు. ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా వారి మెడలలోని పుస్తెలతాళ్ళను దొంగిలించడం, వాటిని విక్రయించడం ద్వారా వచ్చిన డబ్బులను జల్సాలకు ఖర్చుచేస్తున్న రామడుగు మండలం శ్రీరాముపలికి చెందిన వేముల రమేష్(23), వేముల నర్సింహులు(19)లు రామడుగు పోలీసులు ఎన్ఐ గొల్లపల్లి అనూష ఆధ్వర్యంలో శనివారంనాడు రామడుగు మార్కెట్ చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న పై ఇద్దరిని గుర్తించారు. వారిని పట్టుకునే ప్రయత్నంలో పారిపోయేందుకు ప్రయత్నాలు చేశారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై పకడ్బందీగా వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో సదరు ఇద్దరు అనుమానితులు తాము ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి మెడల్లోని పుస్తెలతాళ్ళను దొంగతనం చేయడం ప్రవృత్తిగా కొనసాగిస్తున్నట్లు అంగీకరించారు. ఇప్పటి వరకు రామడుగు మండలంలోని కిష్టంపల్లిలో జూన్ 06న, జూలై 02న వెంకట్రావ్‌పల్లి, గతసంవత్సరం గంగాధర మండలంలో గత జూన్ 03,04లలో ఒంటరిగా ఉన్న మహిళల మెడల్లో ఉండే పుస్తెలతాళ్ళను దొంగలించినట్లు అంగీకరించారు. గతంలో జరిగిన సంఘటనలపై బాధితులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాధుచేశారు. తనిఖీల్లో అనుమానితులు నేరాలను అంగీకరించడంతో పెండింగ్‌లో ఉన్న 04కేసులు చేధించబడ్డాయి. వీరిపై వెంటనే కేసులను నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచారు.

రామడుగు పోలీసులను అభినందించిన పోలీస్ కమిషనర్

అకస్మాత్తుగా నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణలో పెండింగ్‌లో ఉన్న 04కేసులు చేధించడంలో కీలకపాత్ర పోషించిన చొప్పదండి సిఐ ఓ రమేష్, ఎస్ఐ గొల్లపల్లి అనూష, ఇతర విభాగాలకు చెందిన పోలీసులను అభినందించడంతోపాటు వారికి రివార్డులను ప్రకటించారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై ఎలాంటి సమాచారం ఉన్నా సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం అందించేవారి పేర్లను గోప్యంగా ఉంచడంతోపాటు నగదుపారితోషికాన్ని అందజేస్తామని ప్రకటించారు. చురుకుగా పనిచేసే గ్రామరక్షక దళాలలకు కూడా నగదుపారితోషికాలను అందజేయనున్నామని తెలిపారు.




# ప్రతీ పేదవాడి సొంతింటి కలను నేరవేర్చుతాం : మంత్రి శ్రీనివాస్ గౌడ్




మహబూబ్‌నగర్,జులై 11: ప్రతీ పేదవాడి సొంతింటి కలను నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కొండూర్గ్ మండలం వీరన్నపేటలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల లాటరీ ద్వారా లబ్దిదారుల ఎంపిక కార్యక్రమం నేడు జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, కలెక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడతూ..

వీరన్నపేటలో 650 డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించినట్లు తెలిపారు. ఈ నెల 13న మంత్రి కేటీఆర్ మహబూబ్‌నగర్ పర్యటన సందర్భంగా ఈ డబుల్ బెడ్‌రూం ఇండ్లు ప్రారంభిస్తారని తెలిపారు. వీరన్నపేట్‌లో ఇళ్లు లేని 100 మంది ఎస్సీలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. డబుల్ బెడ్‌రూంలకు సంబంధించి దళారులను నమ్మొద్దని పేర్కొన్నారు.

# నేను ఆరోగ్యంగా ఇంట్లోనే ఉన్నా
### వందంతులు నమ్మొద్దంటూ సుద్దాల అశోక్‌తేజ వీడియో సందేశం

హైదరాబాద్,జూలై11(ఆర్ఎన్ఎ): ఇటీవల కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ కోలుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. అయితే, ఆయన ఆరోగ్యంపై వదంతులు మాత్రం కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. నేను బాగానే ఉన్నా. శస్త్రచికిత్స జరిగి 47 రోజులైంది. నా ఆరోగ్యం రోజురోజుకూ మెరుగు పడుతోంది. నా ఆరోగ్యం బాగానే ఉంది. నేను సంతోషంగా ఉన్నా. నా గురించి వస్తున్న వదంతులేవీ నమ్మొద్దు. నా ఆరోగ్యం పట్ల ఎవరికైనా స్పష్టత కావాలంటే నేరుగా నాకే ఫోన్ చేయండి అంటూ తన శ్రేయోభిలాషులను ఉద్దేశించి ఆయన ఓ శనివారం ఓ వీడియో సందేశం విడుదల చేశారు.

# తిరుమల ఆలయం తెరిచి నెల పూర్తి

తిరుమల,జూలై11(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి దర్శనాలను పునరుద్ధరించి నెల రోజులు పూర్తి అయింది. కోవిడ్–19 వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా విధించిన లాక్‌డౌన్ వల్ల భక్తులకు శ్రీవారి దర్శనాన్ని నిలిపివేసిన సంగతి తెలిసిందే. లాక్‌డౌన్ సడలింపులతో జూన్ 11వ తేదీన శ్రీవారి దర్శనాలు తిరిగి ప్రారంభమయ్యాయి. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పరిమిత సంఖ్యలోనే భక్తులకు అనుమతి తెలుపుతున్నారు. ఈ నెల రోజుల్లో 2 లక్షల 63 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నెల రోజుల్లో హుండీ ఆదాయం రూ. 15 కోట్ల 80 లక్షలుగా ఉంది. లక్ష మందికి పైగా భక్తులు తలనీలాలు సమర్పించారు.

# కరోనా టెస్ట్ చేయించుకున్న ఓవైసీ

హైదరాబాద్,జూలై11(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కరోనా పరీక్షలు చేయించు కున్నారు. పాతబస్తీలోని యునానీ దవాఖానలో ఎంఐఎం అధ్యక్షుడు ఈ పరీక్షలు చేయించుకున్నారు. పాత నగరంలో కరోనా పరీక్షల తీరుతెన్నులను తెలుసుకోవడానికి ఎంపీ ఈ రోజు యునానీ హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆంటీజెన్, ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయించుకున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కొవిడ్ టెస్టులపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడానికే తాను పరీక్ష చేయించుకున్నట్లు ఎంపీ వెల్లడించారు. కరోనా ఫలితాల్లో నెగిటివ్ వచ్చినట్లు ట్వీట్టర్‌లో తెలిపారు.

# గౌరెల్లి ప్రాజెక్టుపై నిర్లక్ష్యం తగదు: చాడ

కరీంనగర్,జూలై11(ఆర్ఎన్ఎ): దాదాపు 12 ఏళ్లు గడుస్తున్నా గౌరెల్లి రిజర్వాయర్ పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శ్రీరాంసాగర్ వరద కాల్వలో భాగంగా గౌరెల్లి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ తక్షణమే స్పందించి.. సర్వం కోల్పోతున్న గౌరెల్లి ప్రజలను ఆదుకోవాలని కోరారు. కుర్చీ వేసుకొని మరీ పనులు చేయిస్తాన్న కేసీఆర్ పట్టించుకోవట్లేదని వ్యాఖ్యానించారు. భూములు కోల్పోయిన రైతులకు పునరావాస ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. ఈ మేరకు సీఎం కేసీఆర్, నీటి పారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్, ఈఎన్‌సీ మురళీధర్‌రావుకు లేఖ రాస్తానన్నారు.

# నేపాల్‌లో భారీ వర్షాలకు విరిగిపడుతున్న కొండచరియలు
### 12మంది మృతి..శిథిలాల్లో చిక్కుకున్న 19మంది

ఖాట్మండు,జూలై11(ఆర్ఎన్ఎ): నేపాల్‌లో భారీ వర్షాలు కురుస్తుండడంతో వర్షాల ధాటికి పలు ప్రాంతాల్లో వరదలు పోటెత్తుతున్నాయి. కొన్నిచోట్ల నదులవెంట ఉన్న ఇండ్లు కొట్టుకుపోయాయి. మరికొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ముఖ్యంగా కస్కీ జిల్లాలోని చాలా ప్రాంతాల్లో కొండచరియలు తవిరిగిపడుతున్నాయి. ఈ ఘటనల్లో ఇప్పటికే 12 మంది మృతిచెందగా మరో 19 మంది శిథిలాల్లో చిక్కుకుపోయినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగి నివాస స్థలాలపై పడడంతో చాలా ఇండ్లు నేలమట్టమయ్యాయి. దీంతో చాలామంది వాటికింద చిక్కుకుపోయారు. అన్ని ప్రాంతాల్లో కలిపి ఇప్పటివరకు 44 మంది గల్లంతైనట్లు గుర్తించామని, ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని నేపాల్ అధికారులు అంచనా వేశారు. శిథిలాల కింద గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ముఖ్యంగా పొఖారా పట్టణానికి సమీపంలోని సారంగ్‌కోట్, హేమ్‌జాన్ ప్రాంతాల్లో ఎక్కువగా కొండచరియలు విరిగిపడినట్లు అధికారులు వెల్లడించారు. మ్యాగ్డీ జిల్లాలోనూ కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో మరో 12 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు చెప్పారు.

# సిఐ శంకరయ్య ఇంట్లో ముగిసిన సోదాలు
### భారీగా ఆస్తి పత్రాలు స్వాధీనం

హైదరాబాద్,జూలై11(ఆర్ఎన్ఎ): భూతగాదా కేసులో లక్షా 20వేల రూపాయలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన షాబాద్ సీఐ శంకరయ్య ఇంట్లో ఏసీబీ సోదాలు ముగిశాయి. గురువారం మధ్యాహ్నం నుంచి జరిపిన సోదాల్లో భారీగా ఆస్తులను గుర్తించినట్లు శుక్రవారం రోజున ఏసీబీ అధికారులు వెల్లడించారు. రూ. 4కోట్ల విలువైన ఆస్తులను గుర్తించడంతో పాటు, విలువైన ఆస్తులకు సంబంధించిన పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా.. ఇప్పటికే సీఐ శంకరయ్య, ఏఎస్ఐ రాజేందర్‌లకు ఏసీబీ కరోనా పరీక్షలు నిర్వహించింది. ఉస్మానియా ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహించ నున్నారు. వైద్య పరీక్షల అనంతరం సీఐ, ఏఎస్ఐలను ఏసీబీ న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.




కరీంనగర్ జిల్లా మానకొండూరులో రైతువేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్ రెడ్డి. వేదికపై మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్,ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు తదితరులు ఉన్నారు.

# వ్యవసాయానికి ఎక్కడా ఆదరణలేదు

## తెలంగాణలో కెసిఆర్ అనేక పథకాలకు శ్రీకారం
### కరీంనగర్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న నిరంజన్ రెడ్డి

కరీంనగర్,జూలై11(నేటినిజం ప్రతినిధి): దేశంలోని ఏ రాష్ట్రంలోనూ వ్యవసాయానికి ఇంత ప్రోత్సాహం లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వ్యవసాయరంగానికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్‌లో ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధనా స్థానం నూతన భవనాన్ని మంత్రి శనివారంనాడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సింగిరెడ్డి మాట్లాడుతూ... ఉపాధిహామీని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఏళ్లుగా కేంద్రాన్ని కోరుతున్నా ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తుందన్నారు. రైతుల పట్ల కేంద్రం సానుకూల దృక్పథంతో వ్యవహరించడం లేదన్నారు. ప్రాజెక్టులు, ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, విత్తనాలు, ఎరువులపై రాష్ట్రం ప్రభుత్వం బడ్జెట్ నుండి దాదాపు రూ. 60 వేల కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఆకలిదప్పుల తెలంగాణ ఆరేళ్లలో సీఎం కేసీఆర్ ముదుచూపుతో దేశానికి అన్నపూర్ణగా మారిందన్నారు. సమైక్య రాష్ట్రంలో వ్యవసాయ పరిశోధనాలయాలు నిర్లక్ష్యం చేయబడ్డాయి. 1950 నుండి కరీంనగర్‌లో వ్యవసాయ పరిశోధనా స్థానం ఉంది. పూర్తి సౌకర్యాలతో దీన్ని ఆధునీకరించడం జరిగిందన్నారు. మంచి వంగడాల దిగుబడికి ఈ పరిశోధనా స్థానం వేదికవ్వాలన్నారు. బహుళ ప్రయోజనాల వంగడాలు, ఉత్పాదకత పెంచే వాటిని శాస్త్రవేత్తలు సృష్టించాలన్నారు. రైతన్నలు ధనికులవడమే కాదు. ఈ రాష్ట్ర ఎదుగుదలకు అండగా నిలవాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు.

మానకొండూరులో రైతు వేదిక నిర్మాణానికి మంత్రులు నిరంజన్ రెడ్డి, గంగుల కమలాకర్ భూమి పూజ చేశారు. అనంతరం నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు వేదిక భవన నిర్మాణం చేయడం సంతోషంగా ఉందన్నారు. రైతు వేదికలు సమావేశాలకు పరిమితం కాకుండా సలహాలకు.. సూచనలకు వేదికలు కావాలన్నారు. అనంతరం కమలాకర్ మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అన్నారు. రైతాంగం కోసం అనేక పథకాలు ప్రవేశ పెడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు నీరు అందుతోందని కమలాకర్ పేర్కొన్నారు.

# తెలంగాణ ఉద్యమంలో నల్లపోచమ్మ ఆశీస్సులు ఉన్నాయి

## ప్రార్థనామందిరాలను కూల్చినందుకు అధికారులను జైల్లో పెట్టాలి
### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి

హైదరాబాద్,జూలై11(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఉద్యమానికి వేదికైన నల్లపోచమ్మ దేవాలయం, మజీద్‌ను అమానుషంగా కూల్చటాన్ని ఖండిస్తున్నామని మల్కాజ్‌గిరి ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి అన్నారు. సచివాలయంలోని ప్రార్థనా మందిరాలను కూలగొట్టిన సీఎం, సీఎస్, డీజీపీలకు బేడీలు వేసి చర్లపల్లి జైల్లో పెట్టాలన్నారు. రాత్రికి రాత్రే సచివాలయాన్ని పడగొట్టాలని సీఎం అధికారులను ఆదేశించారన్న రేవంత్ ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ సమీపంలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేయవద్దని సుప్రీమ్ కోర్టు తీర్పు ఉందని గుర్తు చేశారు. పర్యావరణాన్ని కాపాడాలని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా సీఎస్ పెడచెవిన పెట్టారన్నారు. పర్యావరణ అనుమతులు వచ్చినాకనే సచివాలయాన్ని కూలగొట్టాలని అన్నారు. జవహర్ నగర్‌లో ఎలాంటి చెత్త వేయకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని, సచివాలయ శకలాలు ఎక్కడ వేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. సచివాయాన్ని కూల్చడంపై ఒకరిద్దరు ఉద్యోగ సంఘాల నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, వారు కేసీఆర్ ఎంగిలి మెతుకులకు ఆశ పడుతున్నార న్నారు. హిందు మతానికి.. సీఎంకు అనుకూలంగా స్టేట్ మెంట్ ఇచ్చిన ఇద్దరు ముగ్గురు ఉద్యోగ సంఘాల నేతలతో పాటు సెక్రటేరియేట్‌కు చెందిన నరేంద్రరావు అనే ఉద్యోగ సంఘాల సన్నాసి యజమాని కాదని అన్నారు. మత విశ్వాసం ఉద్యోగ సంఘాలకు మాత్రమే సొంతం కాదని అన్నారు. ఉద్యోగ సంఘాల నేతలను చెప్పుతో కొట్టాలని అన్నారు. మసీదు, నల్ల పోచమ్మ గుడి కూల్చితే బీజేపీ, మజ్లిస్ పార్టీల నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మజ్లిస్, బీజేపీ, టీఆర్ఎస్ లు అన్ని ఒకే తాను ముక్కలన్నారు. దేవాలయం కూల్చివేతపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్పందించి దీనిపై బీజేపీ విధానాన్ని ప్రకటించాలన్నారు. 16మంది ముఖ్యమంత్రులు పాలించిన సెక్రటేరియట్‌లో ఆ ముఖ్యమంత్రుల కొడుకులు సీఎం లు కాలేదని కేసీఆర్ కు పండితులు చెప్పారట. ఆ మూఢ నమ్మకాలతోనే కేసీఆర్ సచివాలయాన్ని కూల్చి వేస్తున్నాడు. నమ్మకాలుంటే ఉండొచ్చు...అదే పిచ్చిగా మారొద్దు. నమ్మకాలు ఉంటే ఇంటి వరకే పరిమితం చేసుకోవాలని రేవంత్ అన్నారు.

# రామస్వామితో బచ్‌పన్ దోస్తానా
### పాత జ్ఞపకాలను నెమరేసుకున్న దత్తన్న

హైదరాబాద్,జూలై11(ఆర్ఎన్ఎ): దివంగత మాజీ ఎమ్మెల్యే పి.రామస్వామితో తనకు చదువుకునే రోజుల నుంచి పరిచయం ఉందని, తామిద్దరమూ గౌలిగూడ ప్రాంతవాసులమని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. సీనియర్ బీజేపీనేత, మాజీ మంత్రి పి.రామస్వామి గురువారం మృతి చెందారు. ఈసందర్బంగా దత్తాత్రేయ రామస్వామితో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. రామస్వామి కబడ్డీ బాగా ఆడేవారని, సంఘర్షణలతో మున్సిపల కార్పొరేటర్ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఎమ్మెల్యేగా ఎదిగారని అన్నారు. అలాగే రాష్ట్ర మంత్రిగా కూడా ఆయన ప్రజలకు సేవలందించారని గుర్తుచేశారు. నీటికి నిజాయితీకి మారుపేరుగా ఉండేవారన్నారు. నగరంలోని అనేక దేవాలయాల అభివృద్ధికి అకుంఠిత దీక్షతో పనిచేశారని చెప్పారు. పాతబస్తీలో గొడవలు జరిగినప్పుడు రామస్వామి అక్కడ పర్యటించి ప్రజలకు మనోధైర్య నింపేవాడని తెలిపారు. మజ్లిస్‌నాయకులతో సన్నిహిత సంబంధాలుఉన్నప్పటికీ ఈ విషయంలో వారితో తీవ్రంగా విభేదిఇవంచే వారని అన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు, కార్యకర్తలకు ఆయన అందించిన సేవలు మర్చిపోలేనివని పేర్కొన్నారు. నిరుపేదల ఇండ్లలో చావులకు, పెళ్లిళ్లకు ముందు నిలబడి కార్యక్రమాలు జరిపించేవాడని గుర్తుచేసుకున్నారు.

# తమిళనాడులో మరో మంత్రికి కరోనా

చెన్నై,జూలై11(ఆర్ఎన్ఎ): తమిళనాడులో కరోనా వైరస్ విలయతాండవం చేస్తోంది. తాజాగా రాష్ట్ర కేబినెట్‌లోని సహకార శాఖ మంత్రి సెల్లూరు కె. రాజుకు శుక్రవారం రోజున కరోనా పాజిటివ్‌గా నిర్ధారణయ్యింది. దీంతో ఆయన చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. దీనిపై డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ మాట్లాడుతూ.. మంత్రితో ఫోన్‌లో మాట్లాడానని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అయితే తమిళనాడు కేబినెట్‌లో గతంలో విద్యుత్ శాఖ మంత్రి పి. తంగమణి, ఉన్నత విద్యాశాఖ మంత్రి పి. అన్బళగన్‌కు కరోనా నిర్ధారణ అయ్యింది. తాజాగా సెల్లూర్ కె. రాజుకు కరోనా పాజిటివ్ రావడంతో సహచరులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కాగా తమిళనాడులో ఇప్పటివరకు ముగ్గురు మంత్రులు, 11 మంది ఎమ్మెల్యేలకు కరోనా సోకింది.

# మాదాపూర్‌లో వ్యభిచార గృహంపై దాడి

హైదరాబాద్,జూలై11(ఆర్ఎన్ఎ): మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో వ్యభిచార గృహం నడుపుతున్నారన్న సమాచారం మేరకు సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం గురువారం రాత్రి దాడులు జరిపింది. ఈ ఆపరేషన్‌లో వ్యభిచార రాకెట్టును ఛేదించి పొరుగు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు మహిళలను రక్షించారు. పోలీసులు రాగానే పలువురు వ్యక్తులు సంఘటనా స్థలం నుంచి పారిపోయారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లోని యాప్రాల్ లో కూడా ఇటీవల ఓ వ్యభిచార గృహంపై కూడా రాచకొండ పోలీసులు దాడులు జరిపారు. అక్కడ ఒక అంతర్రాష్ట్ర ముఠా పనిచేస్తోందని, బీహార్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు సుకేష్ రావన్, రంజీశ్ రాజన్, మిథిలేష్ శర్మలు ఈ రాకెట్‌ను నడుపుతున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. పి సాయి కిరణ్, మహ్మద్ సిరాజ్ అనే ఇద్దరు హైదరాబాదీ కస్టమర్లను కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# భూములిచ్చిన వారు సంతోషంగా లేరు

మహబూబ్‌నగర్,జూలై11(ఆర్ఎన్ఎ): జలాశయాల నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులు ప్రభుత్వ తీరుతో సంతోషంగా లేరని రైతు సమస్యల సాధన పోరాటసంఘం నేతలు అన్నారు. వివిధ ప్రాంతాల్లో భూములు కోల్పోయిన రైతులు ఇటీవల తమ నిరసన తెలిపారు. జిల్లాలో కర్వెన జలాశయంతోపాటు పలు ప్రాంతాల్లో భూములు కోల్పోయిన రైతులను లాభదాయకమైన పరిహారమే కాకుండా ఇంటికో ఉద్యోగం ఇస్తానని వాగ్దానమిచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. నష్టపరిహారం కొందరికి మాత్రమే అందిందని, పూర్తిస్థాయిలో అందించలేదని పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.